క్లుప్తంగా

ఘనంగా మెహర్‌బాబా జయంతి



మెహర్‌బాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి: చింతపల్లిలో మెహర్‌బాబా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. 131వ జయంతిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అధిక సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోరాబు శాంతిప్రసాద్, రమేష్, బేతాళుడు, జోగేశ్వరరావు, ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న 8 మంది అరెస్ట్

జి.మాడుగుల: కుంబిడిసింగి పంచాయతీ సంగం గ్రామ సరిహద్దుల్లో జూదం ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ షణ్ముఖరావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగం గ్రామ సరిహద్దు ప్రాంతంలో రహస్యంగా చిత్తులాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.19,410 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, 33 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న రాజవొమ్మంగి ఏవో చక్రధర్

రాజవొమ్మంగి: ప్రతి రైతు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని రాజవొమ్మంగి మండల వ్యవసాయాధికారి చక్రధర్ సూచించారు. మండలంలోని చికిలింత గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారే మాత్రమే ప్రభుత్వ పథకాలకు అర్హులని చెప్పారు. మండలంలో 5,700 రైతు ఖాతాలు ఉండగా.. ఇప్పటి వరకు 2,230 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, భూమి పట్టా, వన్–బీ, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్‌తో దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

రంపచోడవరం: చినబారంగి గ్రామంలో వృద్ధులకు మంగళవారం రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ మాట్లాడుతూ వృద్ధులు చలికాలంలో ఇబ్బందులు పడకుండా ఉండటానికి తమ వంతు సహాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవికుమార్, హెచ్‌ఎం విశ్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదకరంగా గుంత



గంగవరం పాత స్టేట్ బ్యాంక్ ఎదుట హైవేపై పడిన గుంత

గంగవరం: ఇటీవల అభివృద్ధి చేసిన జాతీయ రహదారిపై గంగవరంలోని పాత స్టేట్ బ్యాంక్ ఎదుట పెద్ద గుంత పడింది. రహదారికి మధ్యలో ఈ గుంత ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని భావించిన స్థానికులు కర్రలకు ఎరుపు క్లాత్ కట్టి అప్రమత్తం చేశారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా లోపం కారణంగా ఇలా జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి అధికారులు స్పందించి గొయ్యి పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శివ పూజకు వేళాయె



- మహా శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన శైవ క్షేత్రాలు
- నేడు బొర్రా గుహల వద్ద ఉచిత ప్రవేశం




శివరాత్రికి ముస్తాబవుతున్న అరకులోయలోని శివాలయం

అరకులోయటౌన్/అనంతగిరి(అరకులోయటౌన్): మహా శివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివ పూజకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అరకులోయతో పాటు అనంతగిరి మండలంలోని బొర్రా గుహల వద్ద మహా శివరాత్రి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మండల కేంద్రంలోని శివాలయంతోపాటు పెదలబుడు, యండపల్లివలస, డింగ్రిపుట్, నందివలస గ్రామాల్లోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. అరకులోయ శివాలయంలో అభిషేకాలు, సహస్ర ఘట్టాభిషేకం, లింగోద్భవ విశ్లేష అర్చన, తదితర పూజలు చేయనున్నట్టు అర్చకుడు వెంకన్న తెలిపారు. బొర్రా గుహల వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది. పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి సందర్భంగా బుధవారం భక్తులకు బొర్రా గుహల వద్ద ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అరకు సీఐ ఎల్.హిమగిరి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చింతపల్లి: మండలంలో పురాతన శివాలయాలు మహా శివరాత్రి శోభతో కళకళలాడుతున్నాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. చింతపల్లి మండలం అంతర్ల వద్ద కొండపై అనాదీశ్వర ఆలయం ఉంది. కొండపై కొలువైన ఈ ఆలయాన్ని సాక్షాత్తూ అప్పట్లో రావణబ్రహ్మ నిర్మించారని ప్రచారం ఉంది. లోతుగెడ్డ వీరభద్రస్వామి ఆలయం, మడిగుంట, తదితర పురాతన శివాలయాలు కూడా ఉన్నాయి. ఇటీవల బౌడలో సుమారు కోటిన్నర వ్యయంతో శివాలయాన్ని నిర్మించారు. ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు, అన్నసమారాధనలు నిర్వహించనున్నారు.



లోతుగెడ్డలోని వీరభద్రస్వామి ఆలయం



ఎత్తైన రాతి కొండపై గంగా దేవిగా గిరిజనులు భావించే ఊట బావి

బౌడ శివాలయంలో..

చింతపల్లి: కిటుముల పంచాయతీ బౌడ గ్రామంలోని శివాలయంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు.



అడ్డతీగలలోని పార్వతీ సమేత నాగలింగేశ్వర స్వామి

కోరిన కోర్కెలు తీర్చే శివకేశవ స్వామి

- 500 ఏళ్ల నుంచి నిత్య పూజలు

పెదబయలు: కోరిన కోర్కెలు తీర్చే వేల్పుగా వెలుగొందుతున్న మండలంలోని కిముడుపల్లి లో గల శివకేశవుని ఆలయం భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. స్వయంగా దేవతలే ఈ ఆలయం నిర్మించినట్టు భక్తుల నమ్మకం. సుమారు 500 ఏళ్ల నుంచి ఈ ఆలయంలో నిత్యపూజలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన అంగన్నైని,కటారి,మంతిరి ఇంటి పేర్లు కలిగిన గిరిజనులు పూజారులుగా వ్యవహరిస్తున్నారు. స్వామికి ఎదురుగా నాలుగు నంది విగ్రహాలు దర్శనమిస్తాయి. మహాశివరాత్రి నాడు,కార్తీక మాసంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి,ఒడిశా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించనున్నట్టు పూజారి అంగన్నైని నీలకంఠేశ్వరరావు తెలిపారు.



శివకేశవ స్వామి



స్వామి ఎదురుగా దర్శనమిస్తున్న నాలుగు నందులు

నాగలింగేశ్వర క్షేత్రంలో..

అడ్డతీగల: స్థానిక అనిగేరు రోడ్‌లో కొలువైన పార్వతీ సమేత నాగలింగేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. లింగోద్భవ కాలంలో స్వామి వారికి అభిషేకాలు జరుపుతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.





బొర్రా గుహాల వద్ద శివాలయం, శివలింగం

జ్ఞానజ్యోతి శిక్షణతో ప్రాథమిక విద్య బలోపేతం



కొయ్యూరులో సర్టిఫికెట్లు అందిస్తున్న ఏఎంవో, ఎంఈవో, సీడీపీవో



జి.మాడుగులలో సిబ్బందికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈవో బాబూరావుపడాల్, సీడీపీవో సువర్ణమ్మ

కొయ్యూరు: ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణలో నేర్చుకున్న అంశాలను దృష్టిలో పెట్టుకుని పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంవో) కె.భాస్కరరావు సూచించారు. కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటలు, డ్యాన్స్‌లు, ఇతర అంశాల ద్వారా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బందికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంబాబు, సీడీపీవో విజయకుమారి, రిసోర్స్ పర్సన్లు సురేష్‌కుమార్, తలుపులు, నారాయణ, సూపర్‌వైజర్లు సునీత, కొండమ్మ, మహాలక్ష్మి, బాలామణి పాల్గొన్నారు

వీఆర్ పురం: మండలంలో జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బందికి ఎంఈవో లక్ష్మయ్య, సీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ వనజాక్షి, డీఆర్‌పీ లక్ష్మీనారాయణ సర్టిఫికెట్లు అందజేశారు.

డుంబ్రిగుడ: మండలంలోని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న 106 టీచర్లకు రెండు బ్యాచ్‌లుగా విభజించి జాంగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో 47 మందికి, డుంబ్రిగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో 59 మందికి నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ పత్రాలను ఎంఈవో శెట్టి సుందరరావు, ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ అందజేశారు. టీచర్లు తయారు చేసిన బోధన పద్ధతుల నమూనాలను ప్రదర్శించారు.



డుంబ్రిగుడలో బోధన పద్ధతుల నమూనాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జి.మాడుగుల: మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లకు ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. ఎంఈవో చిట్టపులి బాబూరావుపడాల్, సీడీపీవో సువర్ణమ్మ ఆధ్వర్యంలో రోజుకు 260 మంది అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆర్పీలు రంజన్‌కుమార్, నీలకంఠం, సూరిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సత్య, సుజాత పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గునుకురాయి రహదారి నిర్మాణం



చందాలు వేసుకుని గ్రామస్తులు నిర్మించుకున్న గునుకురాయి రహదారి

గూడెంకొత్తవీధి: ఎవరోవస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా గూడెంకొత్తవీధి మండలంలోని జర్రెల పంచాయతీ మారుమూల ఉన్న గునుకురాయిలో గ్రామస్తులే చందాలు వేసుకుని కొంత మేర రహదారిని నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామస్తులంతా కొంతమేర చందాలు పోగు చేసుకున్నారు. అనంతరం పొక్లెయిన్ సహాయంతో రహదారిని నిర్మించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ గ్రామానికి పూర్తి స్థాయిలో రహదారిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శివాలయం నిర్మాణానికి భూమి పూజ

జి.మాడుగుల: గాంధీనగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో మంగళవారం శివాలయం నిర్మాణానికి భీమిలి సద్గురు సేవాశ్రమం నిర్వాహకుడు, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త సాయిరాం స్వామిజీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 30న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ శివలింగం ప్రతిష్ట చేస్తామన్నారు. ఏ దేవతామూర్తుల విగ్రహాలు కావల్సిన ఉన్నా తమను సంప్రదిస్తే అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు, భక్తులు నాయుడు, ఆతవ శ్రీను, వద్దాది శ్రీనివాసరావు, గొర్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



శివాలయం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సేవాశ్రమం నిర్వాహకుడు సాయిరాం స్వామిజీ

శాస్త్రీయ విధానాలతో మేలైన దిగుబడులు

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రీయ విధానాలను ఆచరించాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రింతాడ, దామనాపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆచరించాల్సిన విధానాలపై శాస్త్రవేత్త అవగాహన కల్పించారు. శాస్త్రీయ విధానాలతో మేలైన దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోందిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త బాలహుస్సేన్‌రెడ్డి

పోలీస్‌స్టేషన్‌లో ఇంటర్ ప్రశ్నాపత్రాలు భద్రం



ఇంటర్ ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని మూడు కళాశాలల్లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు మూడు సెట్లుగా మంగళవారం రాజవొమ్మంగి చేరుకున్నాయి. వీటిని ఆయా కళాశాల యాజమాన్యం స్థానిక పోలీస్‌స్టేషన్ స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, టెన్ ప్లస్ స్కూల్‌కు చెందిన మొత్తం 602 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రంగా గురుకుల బాలికల జూనియర్ కళాశాలను బోర్డు నిర్ణయించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గిరిజనులు అన్నింటా బలోపేతం కావాలి



చింతపల్లిలో శిక్షణకు హాజరైన గిరిజనులు

చింతపల్లి: గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం కావాలని గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) ఎన్.వి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం చింతపల్లి ఉద్యాన పరిశోధనా స్థానంలో గిరిజన ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పీసా, భూబదలాయింపు చట్టం అమలుతో పాటు రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు కుటుంబ కార్డులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. పీసా చట్టం, విధి విధానాలు, అమలు తీరుపై సామాజిక కార్యకర్త రిసోర్స్ పర్సన్ గంజివరపు శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో అజీం ప్రేమ్‌జీ పీఎంయూ విభాగం అధికారి రాంగోపాల్, ప్రతినిధులు పోతురాజు, రమ్య, అనంత లక్ష్మి, చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన గిరిజన రైతులు, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ నర్సమ్మ, సిబ్బంది

ముంచంగిపుట్టు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ నర్సమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. 61 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, వీఆర్‌వో రవికుమార్, కామరాజు, రమేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద 163 సెక్షన్ అమలు

అడ్డతీగల: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద బీఎన్ఎస్ఎస్(భారతీయ నాగరిక సురక్షా సన్నిహిత) సెక్షన్ 163 అమల్లో ఉంటుందని అడ్డతీగల తహసీల్దార్ కొమరం సూర్యారావు తెలిపారు. అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి గది వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం–8లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లు దూరం వరకూ సెక్షన్ 163 వర్తిస్తుందన్నారు. బుధ, గురువారాల్లో ఎటువంటి మద్యం అమ్మకాలు చేపట్టరాదని, విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



గంగవరం పాఠశాలతో విద్యార్థినుల డ్యాన్స్



గురుకుల పాఠశాలలో ఫేర్‌వెల్ వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

గంగవరం: స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే ఉత్సాహంగా జరిగింది. విద్యార్థినులు ఆట పాటలతో అలరించారు. ఈ వేడుకలను ఎంఈవో టి.మల్లేశ్వరరావు, జెడ్పీటీసీ బేబీరత్నం, సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఉపాధ్యాయులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం వీడ్కోలు కార్యక్రమం జరిపారు. ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా విద్యార్థినులు పరీక్షలు రాసి పాసై ఉన్నత చదువులు అభ్యసించాలని ఎంఈవో ఆకాంక్షించారు. హెచ్‌ఎం వరలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

రంపచోడవరం: రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాను చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ భవిష్యత్‌కు మార్గదర్శకులైన గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటామని విద్యార్థులు తెలిపారు.

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం



వై.రామవరం పోలీసు స్టేషన్ వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి

వై.రామవరం: మహాశివ రాత్రికి మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని, గురమంద విశ్వనాథుని ఆలయాల వద్ద బందోబస్తు విధుల నిర్వహించే పోలీసు సిబ్బంది అప్రమతంగా ఉండాలని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించి, ఆయా శివాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై ఎవరెవరు ఎక్కడెక్కడ విధులు నిర్వహించాలన్న విషయంపై ఆదేశాలు జారీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ బి.రామకృష్ణ, దుశ్చర్తి ఎస్ఐ రంగయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు..